

**సాయంత్రం ఆఫీసు నుంచి ఇంటికి వచ్చిన రాజారావ్‌కు ఇంటికి తాళం వేసి వుండడం కనిపించింది. భార్య మాధవి ఎక్కడికి వెళ్ళిందో అతని ఊహకు చిక్కలేదు. ప్రొద్దున ఆఫీసుకు వెళ్ళేటప్పుడు కూడా చెప్పలేదు సాయంత్రం తను పని మీద బయటకు వెడతానని.**

'మరి, అనుకోకుండా అంత అత్యవసరమైన పని ఏమొచ్చిందో!' పక్కింటి వాళ్ళను అడిగితే విషయం తెలుస్తుందని వాళ్ళ పాపను పిలిచాడు "సుజాతా" అంటూ. సుజాత రాలేదుగాని, వాళ్ళమ్మ వచ్చింది. రాజారావ్ అడగకుండానే విషయం చెప్పింది.

"ఇంజనీర్ మాధవరావుగారి భార్య సురేఖతో కలిసి షాపింగ్‌కు వెళ్ళిందండి మాధవిగారు. రెండు గంటలకు వెళ్ళారు. నాలుగు గంటలకల్లా తిరిగి వస్తామని చెప్పారు. అందుకే తాళం కూడా ఇచ్చి వెళ్ళలేదు ... మా లోపలి కొచ్చి కూర్చోండి" అంటూ చాలా మర్యాదగా ఆహ్వానించింది.

"ఫరవాలేదండి ... బహుశా వస్తూ వుంటుంది ..." అన్నాడు మొహమాటంగా నవ్వుతూ.

జాలిగా అతని వైపు చూసి లోపలికెళ్ళింది ఆమె.

రాజారావ్‌కు ఏం చేయాలో తోచలేదు. బజారుకు వెళ్ళి కొంచెంసేపు లైబ్రరీలో గడిపివద్దామనుకున్నాడు. చేతిలో క్యారియర్ వుంది. దాన్ని ప్రక్కింట్లో ఇచ్చి వెళ్ళొచ్చుగాని, మాధవి ఆరున్నర వరకు రాకపోతే పిల్లలు ట్యూషన్ నుంచి వచ్చి ఎక్కడ వుంటారు?

వాళ్ళు ఉదయం తొమ్మిది గంటలకు స్కూలుకు వెళ్ళి, సాయంత్రం స్కూల్ వదిలాక అటు నుంచి అటే ట్యూషన్‌కెళ్ళి ఆరున్నరకు నీరసంగా వేలాడ పడిపోతూ ఇంటికి తిరిగొస్తారు. వాళ్ళు వచ్చేటప్పటికి మాధవి ఇంట్లో లేకుండా, తనూ ఇంట్లో లేకపోతే! — లైబ్రరీకి వెళ్ళే ఆలోచన మానుకున్నాడు.

నిలబడడం, అటూ, ఇటూ పచార్లు చేయడం విసుగనిపించి వాకిలి మెట్ల మీద కూర్చున్నాడు గోడకు చేరగిలబడుతూ.

పక్కింటావిడ పత్రిక పంపించింది.

దాన్ని అటూ, ఇటూ పేజీలు తిరగేశాడు. అందులో మళ్ళీ ఓ అనుబంధ నవల.

దాన్ని అక్కడక్కడ చదివాడు.

డాక్టరైన ఓ ధనవంతుల ఏకైక పుత్రరత్నం గ్రామాలను ఉద్ధరించాలని కంకణం కట్టుకుని ఓ కుగ్రామానికి వస్తాడు. అక్కడో నిరుపేద అమ్మాయిని ప్రేమిస్తాడు. ఆ అమ్మాయి నిరాకరిస్తుంది. ఆ తరువాత, వాళ్ళ మధ్య అపోహలు, అపార్థాలు తొలగిపోతాయి. అతను, ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకుంటాడు —ఇదీ కథ.

చదవగానే కోపం పట్టలేక పత్రికను విసిరి కొట్టాడు. అది పక్కింటి వాళ్ళదని గుర్తొచ్చి దాన్ని తీసుకొచ్చి మెట్ల మీద పడేశాడు.

మళ్ళీ నిరీక్షణ, విసుగు, కోపం.

మాధవి రాలేదుగాని, కొంచెంసేపటికి పిల్లలు వచ్చారు. వాళ్ళూ తండ్రి ప్రక్కన మెట్ల మీద కూలబడ్డారు. వాళ్ళను ప్రేమగా దగ్గరకు తీసుకున్నాడు రాజారావ్. వాళ్ళ భుజాల మీద చేతులు వేసి చిరునవ్వుతో వాళ్ళ వైపు చూస్తుంటే, వాళ్ళు ఎడతెరిపి లేకుండా ఒకళ్ళ తరువాత ఒకళ్ళు స్కూలు కబుర్లు చెబుతున్నారు.

వాళ్ళకు తల్లి దగ్గర కన్నా తండ్రి వద్ద చనువు ఎక్కువ. అందువల్ల తండ్రిని చూడగానే ఆ రోజు స్కూల్‌లో జరిగిన విశేషాలన్నీ చెప్పందే నిద్రపట్టదు వాళ్ళకు.

కొంచెంసేపు కబుర్లు చెప్పాక, ఇక ఆ రోజు



విశేషాలు ఏమీ మిగలలేదేమో చెప్పడానికి చిన్నగా నిద్రలోకి జారుకున్నారు.

ఏడున్నర అవుతుండగా వచ్చింది మాధవి.

భర్త, పిల్లలు మెట్ల మీద వేలాడబడి కూర్చుని వుండడం చూసి, "సారీ అండి. తెలియకుండా ఆలస్యం అయిపోయింది. ప్రక్క వీధిలో సురేఖ లేదూ ... ఇంజనీర్ భార్య ... ఆవిడ బట్టలు కొనుక్కోవాలి తోడు రమ్మంటే ... అనుకోకుండా బజారు వెళ్ళాల్సి వచ్చింది ..." మాట్లాడుతూనే తాళం తీసింది.

" ... ఒక పట్టాన తెమలనిస్తేనా! రెండు చీరల కోసం మూడు గంటలసేపు వెతికింది ..." మాట్లాడుతూనే వుంది. పిల్లలు బూట్లు విప్పి, బాక్సులు ప్రక్కన పడేసి కుర్చీల్లో పడిపోయారు.

రాజారావ్ బట్టలు మార్చుకుని స్నానానికి పోబోతూ వుంటే, చేతిలో పాకెట్‌తో వచ్చింది మాధవి. బజారు నుంచి వచ్చినప్పుడే దాన్ని ఆమె చేతిలో చూశాడుగాని, ఏమిటని అడగలేదు రాజారావ్. చేతిలో పాకెట్ భర్తకు చూపిస్తూ,

"సురేఖ మరీ కలుపుగోలు మనిషండీ. చాలా చనువుగా, ఆప్యాయంగా వుంటుంది. ఆవిడకు బట్టలు కొనడానికి వెళ్ళామా! నేనూ ఓ చీర తీసుకునేదాకా వూరుకోలేదు" అంది పాకెట్ వూడదీసి చీరను చూపిస్తూ.

చీరను చూడగానే రాజారావ్ ఊహించుకోగలిగాడు, అది ఎంత ఖరీదయిందో!

నిర్లిప్తంగా ముఖం పెట్టిన రాజారావ్‌ను చూసి "ఇంత ఖరీదైంది తీసుకోవాలనుకోలేదండి. కాని, సురేఖ బలవంతం చేసింది. 'ఎనిమిది వందల కన్నా తక్కువలో ఇప్పుడు ఏం చీరలు వస్తున్నాయ్. మరేం మాట్లాడకుండా తీసుకో' అని బలవంతం చేసి కొనిపించిందండి" అంది.

"డబ్బు లెక్కడివి" అడిగాడు రాజారావ్.

"ఇప్పుడేం ఇవ్వలేదు. ఆవిడ ఖాతాలో రాయించింది. మూడు నెలల్లో, నెలక్కాస్త ఇచ్చెయ్యమంది."

"ఇప్పుడు నీకు చీరలు అంత అవసరమా? రెండు, మూడు నెలలు జీతం ఆదాచేసి పిల్లలకు సైకిల్ కొనివ్వాలనుకుంటున్నాం కదా!"

"అంటే, చీర కొనుక్కోవడం కూడా తప్పా?"

"తప్పు అని నేననడం లేదు. నీకు చాలా చీరలు వున్నాయి కదా! తరువాత కొనుక్కోవచ్చుగా!"


"ఆ బీరువాల నిండా మీరు కొనిచ్చిన చీరలే! పట్టడంలేదు."

"నేను అంత ధనవంతుణ్ణి కాదులే. పదిహేను వందల జీతగాణ్ణి. నీకన్ని చీరలు కొనివ్వగల తాహతు నాకు లేదుగాని, ఆ కొనుక్కునేదేదో ఎనిమిది వందల్లో కాకపోతే ఏ రెండు వందల్లోనో కొనుక్కోవచ్చుగా."

"ఎందుకండీ, ఇంత చిన్న విషయానికి అంత పెద్ద రాద్ధాంతం చేస్తారు. రేపు వెళ్ళి తిరిగి ఇచ్చివేస్తానులే" అంది చీరను అక్కడ విసిరివేస్తూ.

"తీసుకున్నది మళ్ళీ తిరిగి ఇవ్వనక్కర లేదు. ఈసారి నుంచి అయినా కాస్త జాగ్రత్తగా ఖర్చు పెట్టడం నేర్చుకో!" అనేసి స్నానానికి వెళ్ళిపోయాడు రాజారావ్.

అంతా స్నానాలయ్యాక, వంట చేసి పిల్లలకు,



భర్తకు అన్నం వడ్డించేసరికి రాత్రి పది గంటలయింది.

పిల్లలు తూగుతూనే భోంచేసి పడుకున్నారు.

ఆమెకు మహా కోపం వచ్చింది భర్త మీద.

ఆ కోపాన్ని పిల్లల మీద, వస్తువుల మీద చూపించడం గమనించిన రాజారావ్ రాత్రి పడుకోబోయే ముందు భార్యతో చెప్పాడు —

"ఎందుకు మాధవి అనవసరంగా కోపాన్ని తెచ్చుకుంటావ్? నా జీతం ఎంతో నీకు తెలుసు. ఎంతగా సర్దుకుంటే జీవితం ఇలా సాఫీగా గడిచిపోతుందో నీకు తెలుసు. పెళ్ళికి ముందు కూడా నీకీ విషయం చెప్పాను. నిరాడంబరంగా బతకడం నీకు ఇష్టం అయితేనే మనిద్దరం పెళ్ళి చేసుకుందామని ..."

"ఇప్పుడు పెద్ద ఆడంబరంగా బతుకుతున్నామనుకుంటున్నారా?"

"నేనేం అలా అనుకోవడం లేదుగాని, జీతంతో సర్దుకోవడమే నాకిష్టం. అనవసరమైన ఆడంబరాలకు పోయి అప్పులు చేయడం నాకు నచ్చదు."

"పెళ్ళాం, పిల్లలు ఏమైపోయినా ఫరవాలేదు. మీకు మాత్రం మంచి పేరు కావాలి. కీర్తి ప్రతిష్టలు కావాలి. ... ఆదర్శాలు, దేశభక్తి మీ కొక్కళ్ళకే పట్టింది! ... మీ తోటి గుమస్తాల్ని చూడండి. ఒక్కొక్కడు రెండు, మూడు బిల్డింగ్‌లు కట్టుకుని, పెళ్ళాల మెడల్లో తులాలకొద్దీ బంగారం దిగేశారు. రిజిస్ట్రార్ ఆఫీసులో పనిచేస్తూ పిల్లలకు సైకిల్ కూడా కొనివ్వలేక, పెళ్ళాం చీర తెచ్చుకున్నందుకు రాద్ధాంతం చేస్తున్న అసమర్థుణ్ణి మిమ్మల్నే చూశా" అంది కోపంగా.

భార్య అంత కోపంగా మాట్లాడినా, చిరునవ్వుతో, "అవును, నేను అసమర్థుణ్ణే. ఈ విషయం కట్నం తీసుకోకుండా నిన్ను ఆదర్శ వివాహం చేసుకున్నప్పుడే అర్థం అయివుండాలే నీకు!" అన్నాడు వ్యంగ్యంగా.

"అప్పుడు అర్థం అయితే ఇప్పుడీ బాధ ఎందుకు?" అని కటువుగా గొణుక్కుంది మాధవి.

"అంటే, నీకు కనీసావసరాలు కూడా తీరడం లేదా?"

"తిండి, బట్ట జరిగితే సరిపోతుందా? దిక్కుమాలిన వాళ్ళకు కూడా అవి జరిగిపోతాయి ... ఆదర్శాలకు కూడా ఓ హద్దు వుండాలండీ" అంది మాధవి కోపంగా.

రాజారావ్ ఓ చిరునవ్వు నవ్వాడు.

"అవును. ఆదర్శాలకు ఓ హద్దు వుండాల్సిందే. ఆ హద్దు మనకు ఉపయోగపడే పరిధి మేరకే గీసుకోవాలి. అంతేనా?

"జీవితంలో ప్రతి మనిషీ మార్పును కోరతాడు. ఆ మార్పు తనకు అనుకూలంగా వుండాలి. లేదా కనీసం తనకు దానివల్ల నష్టం జరగనంత వరకు ఆ మార్పుల్ని ఆహ్వానిస్తాడు. తనకు నష్టం కలిగించేట్టయితే ఎంత మంచి మార్పుల్ని అయినా మనిషి వ్యతిరేకిస్తాడు.

నువ్వూ అంతే! నీకు లాభపడే ఆదర్శ వివాహం వరకు ఒక మొగవాడు ఆదర్శంగా వుండాలి. ఆ మగవాడే మొగుడై ఆ తరువాత కూడా ఆదర్శంగా వుంటానంటే అంగీకరించవు.

**పానుగోటి కృష్ణారెడ్డి**

"కాబట్టి, దయచేసి నా దగ్గర ఇంక ఎప్పుడూ ఇలాంటి ప్రస్తావన తీసుకురాకు" అన్నాడు శాంతంగా.

"నా ఖర్మ" అంటూ అటువైపు తిరిగి పడుకుంది మాధవి.

* * *

మాధవి తండ్రి నరసింహారావు కమర్షియల్ టాక్స్ ఆఫీసులో గుమాస్తాగా చేరేనాటికి పూట గడవడం కష్టంగా వున్నా, మాధవి పెళ్ళీడు కొచ్చేసరికి నాలుగు తరాలకు సరిపడా సంపాదించాడు.

ఒక కూతురు, ఒక కొడుకును ప్రసాదించి, ఆస్తి బేలన్స్ దెబ్బ తినకుండా కాపాడిన ఆ భగవంతునికి రోజూ పూజలేకాకుండా, వీలైన చోటల్లా కళ్యాణాలు జరిపించాడు.

దేవుడికి కళ్యాణాలు జరిపించగలిగాడు కాని కూతురి కళ్యాణం చెయ్యలేకపోయాడు.

మాధవికి పుట్టినప్పటి నుంచీ కష్టాలు తెలియవు. పేదరికం తెలియదు. జీవితాన్ని గురించి తెలియదు. తెలుగు నవలలు, సినిమాలు వాటి బాణీలో అవి సమానత్వాన్ని, ఆదర్శాల్ని, స్వేచ్ఛని నూరిపోశాయి.

వీటి ఆదర్శంతో "నేనూ మనిషినే. చదువుకున్నాను. మరి అలాంటప్పుడు అతనికి కట్నం ఎందుకివ్వాలి? కట్నం తీసుకునే వ్యక్తి నాకు అక్కరలేదు" అని తెగేసి చెప్పింది.

నెత్తీ నోరు బాదుకున్నాడు తండ్రి.

ఎన్నోవిధాల చెప్పిచూసింది తల్లి.

"డబ్బు విలువ నీకు తెలియదమ్మా. బంగారు గుడ్లు పెట్టే రెండు సంబంధాలు మాట్లాడాను. ఒకతను ఎ.సి.టి.ఓ., మరొకతను డ్రగ్ ఇన్‌స్పెక్టర్ వీళ్ళిద్దరిలో నీకు నచ్చిన వాణ్ణి చేసుకో తల్లీ" అని బతిమాలాడు, కోప్పడ్డాడు, కొట్టబోయాడు.

అంతకు మించి మరో ప్రయత్నం చేస్తే చస్తానంది కూతురు. ఆమె చస్తే సంపాదించినదంతా ఏం చెయ్యాలో అర్థం కాలేదతనికి. తీసుకున్న లంచాలన్నీ ఎవరివాళ్ళకు ఇచ్చివేయడం సాధ్యం కాదనుకున్నాడేమో, అంతపని చేయవద్దని కూతుర్ని బతిమాలి, కట్నం కోరని అల్లుడి కోసం దేశం మీద వల వేశాడు.

అందులో పడ్డాడు రాజారావ్.

ఎగిరి గంతేశాడు మాధవి తండ్రి. అల్లుడు దొరికినందుకు కాదు, అతను రిజిస్ట్రార్ ఆఫీసులో క్లర్క్ అయినందుకు.

కుర్రతనంలో ఆదర్శాలు పాటించినా, సుఖాలు మరిగాక దేశాన్ని తిట్టేసి, అందరూ దేశాన్ని దోచుకుంటుంటే తనెందుకు చేతులు కట్టుకూర్చోవాలని ఉపన్యాసమిచ్చేసి తనూ ఓ చెయ్యి వేస్తాడని గట్టి నమ్మకం అతనికి.

ఆ నమ్మకంతోనే రాజారావ్‌తో మాధవికి వివాహం జరిపించాడు.

కూతుర్ని కాపురానికి పంపుతూ లారీడు సామాన్లు పంపాడు, పుట్టబోయే పిల్లాడికి ఉయ్యాల తొట్టెతో సహా.

సామాన్లతోపాటు భార్య ఇష్టపడి తెచ్చుకున్న సూట్‌కేస్ సైజ్ త్రీ ఇన్ వన్ టేప్‌రికార్డర్‌ను కూడా తిప్పి పంపాడు రాజారావ్.

నిరాశ పడిపోయాడు మామగారు.

దిగులు పడింది మాధవి.

మళ్ళీ లారీ పంపుతానన్నాడు మాధవి తండ్రి.

ఒప్పుకోలేదు రాజారావ్.

బతిమాలింది మాధవి.

అంగీకరించలేదు రాజారావ్.

"అవి ఎద్దన్న వాడివి నువ్వన్నా సంపాదించు"

"అలాంటి ఆశలు పెట్టుకోవద్దు."

అతని కొలీగ్స్‌ని, వాళ్ళు సంపాదిస్తున్న ఆస్తుల్ని చూపుతుంది మాధవి.

చిరునవ్వు నవ్వి వూరుకుంటాడతను.

ఈ రోజూ అంతే!

... రాత్రి రెండు గంటలయినా నిద్రపట్టలేదు మాధవికి. తెరలు తెరలుగా ఒకటే ఆలోచనలు.

తెల్లవారుఝామున నిద్రపట్టే ముందు, 'జీవితంలో పెద్ద పొరపాటు చేశాను. నాన్న చెప్పిన ఆ రెండు సంబంధాలలో ఏదో ఒకటి చేసుకోవాల్సింది" అనుకుంది మాధవి.

◆